# ప్రణయ కలహం

**శ్రీ కాదంబరి వెంకటేశ్వరరావు**

"మూడునాళ్ల ముచ్చటకే మురిసితివి మనసా... యీ తనువు శాశ్వతమా, యీ ధనము శాశ్వతమా, శ్రీహరిసేవేగతి గద మనసా......" అని పాడుకుంటూ వస్తున్నారు మామేష్టారు. "మేష్టారూ వైరాగ్య ధోరణిలోకి దిగేరే? ఇదెప్పటునుంచి యీ వేషం, యీ స్థితీ యీలాగున్నారేమండీ అన్నాను. ఆరోజున కాలేజీ లేదు. నాగదిలో కూర్చొని ఒక ఇంగ్లీషు పుస్తకాన్ని చదువుతున్నాను. "నీకేం బాబూ నవయువకుడవు. మంచి సైలాపచ్చీసుగా వున్నావు. నాస్థితి నీకేం తెలుస్తుంది. నీ యుక్తి మాటలకేంలే నాగతి నీకూ కలిగినప్పుడు ఆలాగనవు" అన్నాడు మేష్టారు ఒక కుర్చీలో బైఠాయించి... "ఏమిటండీ మేష్టారూ ఆలాగంటారు మీసంగతి నాకేమీ బోధపడ్డం లేదు. ఏంవిపత్తు కలిగింది మీకు నాచేతనైతే వుపకారం చేస్తాను. కాసింత నాకూడా వినిపించండి మహా మంత్రంలా జపిస్తా...... "బాబూ నీవు సామాన్యుడవు కావు. నీతో చెప్పేనంటే బట్టబయలు చేస్తావు. నీ నోటికి ఆటంకంలేదు. ఇంతకూ చెపితే ఆరుస్తావా? తీరుస్తావా?" "ఆలా కాదండీ తప్పకుండా చెప్పితీరాల ఆ సంగతేమిటో వినాలనివుంది. చెప్పిందాకా కదలనియ్యను."..."ఆహా ఆసుఖదినాలు మరుద్దామంటే మరపుకి వస్తాయా? యీ చరిత్రంతా ఒక క్షణకాలంలో జరిగినట్టుగా జరిగిపోయింది. ఆమె ముఖబింబాన్ని మళ్లీచూద్దామంటే లభ్యమవుతుందా? ఎంత సుఖం, ఎంత ప్రియతరం అవన్నీ కలలోని వార్తలు"......"అదేమండీ మాష్టారూ! మీరీ ప్రపంచంలో లేనట్టున్నారే. కొంపముంచి దేవేంద్రసభలో నాట్యంచేసే ఊర్వశి జ్ఞాపకానికి రాలేదు కదా?"......ఒరేయి గోపాలం నీహేళనకేంలే ఊర్వశి జ్ఞాపకాని కొచ్చిందంటావు, రేపు పొరపాటున ఊర్వశిని నే పొందేనంటావు సరే కాని నీకడుపు చల్లగా యీసంగతి మాత్రం ఎవరితోనూ చెప్పక, జాగ్రత్తగా విను, అంటూ ఒక్క దీర్ఘ నిశ్వాస విడచి యీవిధంగా చెప్ప మొదలెట్టేరు మేష్టారు.

*     *     *

యీ విషాద చరిత్రంతా జరిగి ఒక సంవత్సరం పైగా అయింది. యీ వూరికి తూర్పు ముఖంగా ఒక అందమైన పూలతోట వుంది. ఆతోటకి మధ్యగా అందమైన ఒక చిన్న డాబా వుంది. వూరికి దూరంగా వుండటంచేత చల్లటిగాలి. పరిశుభ్రమైన నీరూ దొరికేవి. ఆకారణంచేత దూరమైనా భారమని ఆలోచించక ఆ ఇంట్లో ఒక గది అద్దెకు తీసుకొని వుంటూ వుండేవాణ్ణి. ఆయిల్లు యజమానులు ఒకాయనా, ఆయిన భార్యా మాత్రమే వుండేవారు. ఆమె నవయువతి, మంచి రూపసి చలాకే ఐంది. ఆమెపేరు "రాధ" పాపం ఆమె అందానికి తగిన భర్తకాడు. ఒక వెర్రిబాగులవాడు. అదో మాదిరి తరహావాడు......కొంత కాలం జరిగిపోయింది. చిరకాలంనుంచీ ఒకే ఇంట్లో వుండటం వల్లా, తలవని తలంపుగా భగవత్కృపవల్లా ప్రణయ బాంధవ్యం కుదిరింది. నేను ఒక్కణ్ణి వెనకాల ఎవరూ లేరు. పగలల్లా కష్టపడి పాఠాలుచెప్పి, యింటికి వచ్చేసరికి వండుకుతినటం చాలా కష్టంగా వుండేది. అంచేత నాతిండి కూడా వాళ్లతోటే చేసేవాణ్ణి. మేంముగ్గురం సమిష్టి కుటుంబంలావుండే వాళ్లం. ఆరోజులగా యతు నా సంపాదనంతా ఆమెచేతుల్లోనే పెట్టేవాడిని. మేంయిద్దరం ప్రణయగాధల్లో మునుగుతూ వుంటే ఆమె భర్త చూసీ చూడనట్టు ఆదోలా సంచరించేవాడు.

కాంతులు దిగజారి నైదిక్కులు దిగ్భ్రిమ చెందేయి. ప్రపంచమంతా

కళావిహీనమైంది. ఆ ప్రమిత్రుడు మెల్ల మెల్లగా తప్పటడుగులు వేస్తూ పోయి పోయి పశ్చిమ కొండల్లోకి దిగి, విశ్రాంతి తీసుకున్నాడు. నిశాచరుడు శీతల కాంతులతో ఖాళీ స్థానాన్ని ఆక్రమించి, చల్లని చూపులతో ప్రపంచాన్ని వీక్షిస్తున్నాడు. యిప్పుడు పుచ్చపూపుల్లా వుంది వెన్నెల. మందమారుతం హాయిగావీస్తోంది. ప్రకృతి అంతా నిద్రపోతూన్నట్టు వుంది. చల్లగాలికి నేను డాబామీద కూర్చొని "తారాశశాంక విజయం" ప్రబంధాన్ని చదువుతున్నాను. నామనస్సంతా ఆ పుస్తకంలోనే లీనమైంది......"అబ్బా వుండూ ? ఎవరువారు ? కళ్లు నెప్పెడుతున్నాయి. చేతులుతీద్దూ. రాధా నీవా కొంటెపిల్లా......"పాపం ఇంత మాత్రానికే నెప్పెడతాయీ" ఈ చిత్రం ఎక్కడా చూడ లేదు. భయపడ్డారు కాబోలు, అంటూ రాధ నాచేతిలో పుస్తకం లాక్కొని ప్రక్కను బైటాయించింది......"రాధా...చూడు ప్రకృతి ఎంత ప్రీతిగా వుందో...ఆలా చంద్రునికేసిచూడు, ఆ బింబంలో నలుపు ఏలా ఐక్యమై పోయిందో...అలా మనంకూడా ఏకమా కూడదూ ? జన్మ జన్మాలకైనా నీవే నాహృదయాది దేవతవు. నిన్ను వదలి క్షణకాలమైనా వుండ లేను" అన్నాను. ఆమెను నా వళ్లోకి తీసుకొని... "పాపం మీరు చాలా వెర్రివారు. మీకేం తెలియదు. ఆ బింబంలోవున్న నలుపుని చూసి భ్రమించిపోయేరు. జన్మ జన్మాలకైనా నీవే నాహృదయాది దేవత వన్నారు. ఒకవేళ భగవంతుడు మనకు వ్యతిరేకమైతే, మరి మీరు నన్నువదలి వుండగలరా ?" అంది రాధ చిరునవ్వు నవ్వుతూ......"ఆలా అమంగళం మాట్లాడకు ఒక్క క్షణకాలంకూడా నిన్ను వదలి వుండ లేను. నీవే ఆరాధ్య దేవతవు. ఎంత సుఖప్రదం... ఎంత ప్రియతమం..." యిటువంటి ఆనంద విహారాలతోటి నాలుగేళ్లు గడిచిపోయింది. గోపాలం ఇంక చెప్పలేను. ఆ సంగతి తలుచుకుంటే నామనస్సు చలించి పోతోంది." అంటూ నడిచీ నడిచీ బండిలా ఒక్క సారి ఆగిపోయేరు. మేష్టారు..."ఆలా అనకండి మేష్టారూ కథ మంచి రసవత్తరంగా వుంది. చెప్పి తీరాల అని బలవంత పెట్టేను."..."అయితే శ్రద్ధగా విను గోపాలం మధ్య అడ్డదిడ్డం ప్రశ్నలు మాత్రం వేయకు" అని చిటికెడు పొడుంపీల్చి మళ్లీ యీవిధంగా చెప్ప మొదలెట్టేరు.

* * *

ఒకరోజు రాత్రి పదిగంటలైంది. నేను సినీమా నుంచి ఇంటికివచ్చేను. ఇల్లంతా నిద్రపోతూన్నట్టుగా వుంది. రాధ మొగుడుమాత్రం క్రింద చావిట్లో గుర్రెట్టు నిద్రపోతున్నాడు. నాదుస్తులన్నీ తీసి కొత్తబట్టలు కట్టుకొని, సిగరట్టు కాల్చుకుంటూ చరచరా డాబా ఎక్కుతున్నా. ఏవేవో మాటలు వినబడుతున్నాయి. క్షణకాలం నిశ్శబ్దంగా నిలబడ్డాను.....ఏముంది నా ఆకాశ సౌధాలు గాలికి కొట్టుకుపోయేయి. నా సుఖం అంతరించింది. నాకళ్లను నమ్మలేక పోయాను. నన్ను మనసార ప్రేమించిన రాధ...యీ రోజున తుచ్ఛ ప్రేమకై...ధనాని కాశపడి...పరాయివారితో చరిస్తుందా వట్టిది. వట్టిది. పొరపాటు పడ్డాను. రాధ హృదయం అతి మెత్తనిది. ఆమె అంతరంగం నాకు బాగా తెలుసు...ఏమో స్త్రీలు చంచలచిత్తులు. మనసు మారిపోకూడదూ ? ఎల్లకాలం ఒకలాగే వుంటుందా ? భగవంతుడు మాసుఖాన్ని చూసి ఓర్వలేక పోయేడు. కాలచక్రం గిర్రున తిరిగిపోయింది. నాహృదయంకూడా తిరిగిపోయింది.....నా అనుమానమే స్థిరం ఆమె పరాయివాడితో సరస సల్లాపాలాడుతోంది "ఛీ ఆడదాన్ని నమ్మకూడదు. ఈలానీచంగా చరిస్తుందని కలలోనైనా అనుకోలేదు." ఇంక వుండ లేక పోయేను. శరీరం వేడెక్కింది బట్టలన్నీ చెమటతో తడిసిపోయేయి. యీ రోజులగాయతు ఆమెకు దూరంగా వుండాలనుకున్నాను. వచ్చినదారినే తిరిగి వచ్చి క్రిందపడుకున్నాను.

ఒక రోజు మధ్యాహ్నం రాధ మొగుడూ నేను కలసి భోజనంచేస్తున్నాం. ఆరోజునుంచే మాకిద్దరకూ ఎడమొఖాలూ పెడమొఖాలూ. రాధ నాతో మనసిచ్చి మాట్లాడ్డంలేదు. నేనూ సరిగ్గా మాట్లాడ్డంలేదు. "చూసేరూ సినీమాలో చింతామణి భవానీశంకర్ యిణ్ణికూడా ఏలా తిరస్కరించిందో అంత ధనం కలవాణ్ణే ఆలా తిరస్కరిస్తే, మరి సామాన్యులను ఎందుకు తిరస్కరించకూడదూ ?" అంది రాధ భర్తతో. ఇంకా ఏవేవో అంది. అవన్నీ అర్థంచేసుకున్నా. ఆమెకూడా చింతామణిలాంతయూరౌద్దా మనుకుంది. నామీద ఇష్టంలేనట్టుగా తేల్చింది. మొన్నరాత్రి చూసిన చింతామణి ఫిల్ములోని కథంతా కంటికి కట్టినట్టయింది. ఏమీ అనకుండా భోజనం ముగించేను......తర్వాత కొంతకాలానికి తెలిసింది ఆమె ఒక పతిత అని. ఆమెకు ఇదే వృత్తి. ఆమె మొగుడు అనాధునిలా చేత కానివాడై కూర్చుంటే యీవిధంగా ధనార్జనచేసి డబ్బు గడించి యీ యిల్లు కట్టింది. భోగవిలాసాలతోటు తులతూగుతూంది. ఆమె సాంగత్యంవల్ల నేనుకూడా పతితుణ్ణి అయ్యాను. ఒక మహాపరాధాన్ని చేసేను. ఎంతత్వరలో యీ ఇల్లువదలి పోతానో, అంతత్వరలో పాపకూపంలోనుంచి బయల్పడుతాను అనుకొన్నాను.

* * *

కాలచక్రం తనదారిని తాను తిరుగుతూనే వుంది. దాంతోపాటు మాహృదయాలుకూడా తిరుగుతూనే వుండేవి. యిదివరదాకా చాటుమాటుగా సంచరించేది ఆ కొత్తమనిషితో. యిప్పుడు బహిరంగంగానే సంచరిస్తోంది. నేను వింటూవుండగానే వంచనార్థంగా అతణ్ణి పొగిడేది. కారణంలేందే అకారణంగా చిన్న చిన్న కలహ కారణాలు రేగేవి. నామాటంటే ఆమెకు చాలా చిరాగ్గావుండేది. "దిక్కుమాలిన సంతవాళ్లందరినీ కూచో పెట్టి నే చేయలేను" అంటూ భోజనాల దగ్గర విసుక్కుంటూ యుండేది. నేనుమాత్రంకిం మనకుండా రెండు మెతుకులు నోట్లో వేసుకొని ఏదో పుస్తకం తీసుకొని కాలక్షేపం చేసేవాడిని. ఆమె సాయంకాలం కాగానే మంచి మంచి సిల్కు చీరలు ధరించి ముస్తాబై కూర్చుండేది. ఆ కొత్తపురుషుడు రాగానే యిద్దరూ కలసి సినీమాలకూ, నాటకాలకూ వెళ్లుతూ యుండేవారు. యీవిధంగా వింతలతోటి, విచిత్రాలతోటి, చాలా రోజులు గడిపేసేరు. నేను కూడా ఏలాగో రోజులు గడిపేవాణ్ణి. ఏలాగైనా ఆమె సాంగత్యం వదలి బయటపడతానా అనిపించేది.

* * *

ఒక రోజు రాత్రి ఎనిమిది గంటలకు బజారు నుంచి ఇంటికి వచ్చేను. గదితలుపు తీసి ఆ బట్టలు విడిచేసి, ఇంకో బట్టలు కట్టుకొని నూతిదగ్గరకు కాళ్లు కడుక్కునేందుకు వెళ్లేను. డాబామీద ఏవేవో మాటలు వినబడుతున్నాయి. ఒక్క నిముసం నిలబడి విన్నాను. "రాధా చూడు వెన్నెల ఏలా మెరుస్తోందో ప్రకృతి అంతా ఎంతప్రియంగా వుందో ? చూడు నీ ముఖబింబంకూడా ఏలా మెరుస్తోందో ?......ఎంత సుఖం...ఎంత ఆనందం...ఏంలాభంమన ఆనంద విహారానికి ఆటంకం కలుగుతోంది. ఏలాగైనా ఏదో మిష మీద ఆ చచ్చుముండా మేష్టర్ని ఇంట్లోనుంచి గెంటివేయాలి. రేపు ఏదో వంకమీద ఇల్లు ఖాళీచేయమను. వెడతాడా సక్యంగా వెడతాడు. లేదా అప్పుడు వుందివాడిపని......ఇంకా ఏవేవో వినబడ్డాయి. నా శరీరానికి ముళ్లుగుచ్చుకున్నట్టయింది. "అయినా అదీ చూద్దాంగా కథ ఏలా ముగిస్తుందో" అనుకొంటూ చడిచప్పుడు లేకుండా గదిలోకి పోయేను.

* * *

ఆ మరునాడు మధ్యాహ్నం భోజనంచేసి నా గదిలో కూర్చొని పుస్తకం చదువుకుంటున్నా. "మేష్టారూ ఏమనుకోక యీ యిల్లు ఖాళీచేయండి చుట్టాలూ పక్కాలూ వస్తారు రేపు" అన్నాడు రాధ మొగుడు చూచాయగా. "ఆలాగే కొండి వారం రోజుల్లో ఏదో ఇల్లుచూసుకొని పోతాను. యీలోగా

చుట్టాలువస్తే వాళ్లతోపాటే ఏలాగో వుండి ఇల్లు చూసుకు పోతాను'' అన్నాను. "అలా పనికిరాదని చెప్పండి. వీల్లేదు. యీవాళే యిల్లు ఖాళీచేయాలి. సామాను సర్దుకోమని చెప్పండి.'' అంది రాధ మొగుడుతో పక్కకిటికీలోంచి. "ఎందుకు వీల్లేదో చూస్తాగా. నిలుచున్న పళంగా ఏలా వెళ్లమంటావు. ఏదో ఇల్లు చూసుకున్నాక ఒక్క ఘడియ వుండమంటే వుండను. యిప్పుడు నీవు బలవంతం పెడితే మాత్రం వెడతా ననుకున్నావా?'' అన్నాను కోపంగా. "ఎందుకు వెళ్లవయ్యా ఎవరి బాబుగారి సొమ్మను కున్నావు ఏం తెగనీలుగుతున్నావు. నీ వెడతావా నీ యబ్బ వెడతాడా? ఆట్టే మాట్లాడేవంటే బుర్ర రామకీర్తన పాడుతుంది జాగ్రత్త'' అంటూ ఆ కొత్తమనిషి తలుపు తీసుకొని మీద మీదకు వచ్చేడు. "ఏంచేస్తావేమిటి నీ బెదరింపులూ నీవూను. నీ తాతగారి సొమ్మే అనుకో నిలుచున్న పళంగా ఏలా పొమ్మంటావు. నే పోను ఏంచేస్తావో చేయి.'' అన్నాను. "ఏంచేస్తానా చూడు పెంకె వేషాలూ నీవూను. నీకు బుద్ధిలేదూ ఎందుకు పోవు'' అంటూ మీద కురికేడు. నీ వెంతంటే నీ వెంతని యిద్దరం కలియపడ్డాం. యిదంతా చూస్తూన్న దారేపోయే పెద్దమనిషి మాయిద్దరి మధ్యకూ వచ్చి దెబ్బలాట చల్లార్చేడు. ఆరోజాలా గడిచిపోయింది.

* * *

ఇప్పుడు నేను ఆనందంగా వుంటున్నాను. హాయిగా గుండెమీద చేయిపెట్టికొని నిద్రపోతున్నా. ఆప్రాంతం వదలి వూరిమధ్యకువచ్చి నివసిస్తున్నాను. భగవంతుని లీలలు ఏలా పరిణమించేయో చూడు. నా డబ్బంతా ఆమెకు అర్పణం చేసేను. నా మానప్రాణాలన్నీ ఆమెకే అర్పించేను. ఆమెను ఒక ఆరాధ్య దేవతగా పూజించేను. కాని యీలా జరుగుతుందని కలలో నైనా అనుకోలేదు. అపరాధానికి తగిన పరాభవాన్ని పొందేను. ఆ రోజుల్లో భగవంతుణ్ణి కూడా ధిక్కరించి తిరిగేవాణ్ణి. ఆ పాపఫలమే నాకు మంచి ప్రయశ్చిత్తాన్ని కలిగించింది. ఆ పరాభవాన్నే నన్ను వైరాగ్యంలోకి దింపింది. ఆహా ఆ సుఖదినాలు మరుద్దామంటే మరపుకి వస్తాయా. యీ చరిత్రంతా ఒక్క క్షణకాలంలో జరిగిపోయింది. ఆమె ముఖబింబాన్ని మళ్ళీ చూద్దామంటే లభ్యమవుతుందా? ఎంతసుఖం. ఎంత ప్రియతరం. అవన్నీ కలలోని వార్తలు. అవన్నీ తలచుకుంటే మనస్సు చలిస్తుంది. గోపాలం. మరి వైరాగ్యంలోకి దిగక, ఇంకెందులోకి దిగమంటావు. ఇదే నా "ప్రణయకలహం, యొక్క విషాదచరిత్ర. విన్నావుగదా. ఇంతకాలంవరకూ నా హృదయంలోవుండి మనస్సుని బాధపెట్టేది. యిప్పుడు నాహృదయ భారాన్నంతా నీకు వినుపించుకొన్నా. నా మనస్సు చల్లపడింది. రాత్రి తొమ్మిది గంటలైంది, పడుకో పాపం నాగురించి చాలా శ్రమ తీసుకున్నావు. వెళ్లొస్తా" నంటూ మా మాష్టారు సెలవు తీసుకున్నారు. యిదంతా ప్రక్కనుంచి వింటూన్న మా ఆవిడ పక్కున నవ్వింది.


## చేతిపనుల వర్తక రహస్య బోధిని

సబ్బులు, సెంటులు, పరిమళతైలములు, బాణసంచ, అత్తరు, పన్నీరు, పిప్పరమెంటు, మందులు మొదలగునవి సులభముగా తయారుచేయు పరిశ్రమలు 500 గలవు. ధర 1 రూపాయి, పోస్టుఖర్చులు 5 అణాలు.

కొక్కోకము

స్త్రీ పురుష రహస్యములు 64 చిత్రపటములతో 302 పేజీలుగల పెద్ద పుస్తకము. ధర రు 1-0-0. పోస్టుఖర్చు రు. 0-5-0 లు. ఇందులో స్త్రీపురుష శృంగార రహస్యములు, శయ్యాగృహ మర్మములు గలవు.

దాంపత్య మర్మములు

పడకటి ముచ్చటలు, రతి సంబంధమయిన అనేక మర్మవిషయము లిందు గలవు. 9 పటములలో 102 పేజీలుగల పెద్దపుస్తకము. ధర రు. 0-8-0. పోస్టుఖర్చులు 0-5-0. కొక్కోకము, దాంపత్యమర్మములు ఒకేదపా రెండుకొనిన పోస్టుఖర్చులతో రు. 1-12-0.

మహారాజ పుస్తకశాల

అరుణాచలమొదలి వీధి, 18 బీటు, మద్రాసు.